ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్లటౌన్, మార్చి 11: మహిళలు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదుగాలని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్ మేళాను ప్రారంభించి మాట్లాడారు. జాబ్ మేళాలో ఎంపికైన మహిళలకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేయండి

రాచకొండ సీపీకి గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వినతి

సీపీ సుధీర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 11: మామిడి సీజన్ దృష్ట్యా బాటసింగారం పండ్ల మార్కెట్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం కోరింది. ఈ మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బాటసింగారం పండ్ల మార్కెట్‌లో ఈ ఏడాది మామిడి పండ్ల విక్రయాలు అధికంగా జరిగే అవకాశం ఉన్నందున మార్కెట్ ప్రాంతంలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటుచేయాలని కోరారు. పండ్ల మార్కెట్‌కు వచ్చే దిగుమతులను తగ్గించేలా కొంతమంది బ్రోకర్లతో కుమ్మక్కయి బయటప్రాంతాల్లో వ్యాపారం చేస్తున్నారని, ఇలాంటివారిపై నిఘా ఉంచి ఎస్‌ఓటీ, విజిలెన్స్ వారితో తనిఖీలు చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, సభ్యులు జైపాల్‌రెడ్డి, గణేశ్‌నాయక్, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, అంజయ్య, వెంకటేశ్వర్లు గుప్తా ఉన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు

సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ మండల కన్వీనర్ నరేశ్‌చారి

కొత్తూరు, మార్చి 11: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేశ్‌చారి డిమాండ్ చేశారు. ఈ నెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో కొత్తూరు మున్సిపాలిటీలో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నరేశ్‌చారి మాట్లాడుతూ ఫీజులు కట్టలేదని నెపంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వడంలేదన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకొని విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇప్పించాలన్నారు. అలాగే పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు శివకుమార్‌చారి, సందీప్‌సింగ్, మురళీగౌడ్, జుగేవ్, హర్షయాదవ్, రాజు, రాంజీ, ఉదయ్, అజిత్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల తనిఖీ

ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్న ఏపీవో

కొందుర్గు, మార్చి 11: మండలంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీవో నర్సింగరావు మంగళవారం తనిఖీ చేశారు. మండలంలోని చిన్నఎల్కిచర్ల, చెరుకుపల్లి గ్రామాల్లో పర్యటించి ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. ఎవరైనా అనారోగ్యంతో బాధ పడుతున్నవారు ఉంటే ఎండలో పని చేయొద్దని, ఆరోగ్యం కుదుట పడ్డాక పనులకు రావాలన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో తాగునీటి వసతితోపాటు ప్రథమ చికిత్సకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. వారి వెంట ఈసీ రజిత, తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా ఇంటర్ పరీక్షలు

కేశంపేట, మార్చి 11: మండల పరిధిలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలు సాఫీగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన పొలిటికల్ సైన్స్, బొటనీ పరీక్ష-1కు 187మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్ తెలిపారు. పరీక్షల తీరును సిట్టింగ్ స్క్వాడ్ శివకుమార్ పర్యవేక్షించగా కేశంపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మంచాల, మార్చి 11: మండల పరిధిలోని పటేల్‌చెర్వుతండాలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నిధులు నుంచి మంజూరైన రూ.11లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను మాజీ సర్పంచ్‌లు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రాజునాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటేల్‌చెర్వుతండాలో చేపడుతున్న సీసీరోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేశ్, గ్రామస్తులు మోహన్ నాయక్, శ్రీనివాస్, చంద్రయ్య, సురేశ్, ధర్మానాయక్, లక్ష్మణ్‌నాయక్, ఐలయ్య, భాస్కర్, శ్రీనివాస్‌నాయక్, క్రాంతికుమార్, సీతారాంనాయక్, పాల్గొన్నారు.

పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరిస్తా

ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ
రూ.3 లక్షల నిధులు మంజూరు చేసిన కలెక్టర్

పాఠశాలలో నీటి సమస్యను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

ఆదిబట్ల, మార్చి 11: పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరిస్తానని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూరు ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో కలెక్టర్ ఆదేశానుసారం మున్సిపాలిటీ కమిషనర్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాఠశాలలో 5 బోర్లు వేశామని అన్నారు. గ్రౌండ్ వాటర్ లేకపోవడంతో అక్కడ ఆ బోర్లు సైతం ఎండిపోయినట్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా పాఠశాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు కాల కృత్యాలు తీర్చుకోవడానికి నీటి సమస్య ఏర్పడుతుందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఇందిరమ్మ కాలనీలో బోరు ద్వారా పాఠశాలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపడుతామన్నారు.

3లక్షల నిధులు మంజూరు..

బొంగుళూరు ఆదర్శ పాఠశాలలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశిస్తూ మంగళవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి రూ.3లక్షల నిధులు మంజూరు చేశారు. వెంటనే బోర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థులకు హాస్టల్‌కు కావాల్సిన బోరు బుధవారం రోజున పూర్తి చేయాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న శంషాబాద్ డీసీపీ రాజేశ్, చిత్రంలో సీఐ ప్రమోద్‌కుమార్

పోలీసులు స్నేహభావంతో మెలగాలి

శంషాబాద్ డీసీపీ రాజేశ్

ఆమనగల్లు, మార్చి 11: పోలీసులు ప్రజలతో స్నేహభావంతో మెలగాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. మంగళవారం ఆమనగల్లు పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని శంషాబాద్ డీసీపీ రాజేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలపై మాట్లాడి పలు సలహాలు, సూచనలు చేశారు. అదే విధంగా శాంతి భద్రతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్, సిబ్బంది ఉన్నారు.

ఫార్మా భూ బాధితుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

యాచారం, మార్చి11: ఫార్మా భూ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. మండలంలోని కుర్మిద్ద గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఫార్మా భూ బాధిత రైతులతో మంగళవారం భూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ఆమోదం లేకుండా ఫార్మాసిటీ, ఫ్యూచర్‌సిటీ, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు కోసం బలవంతంగా భూ సేకరణ చేయొద్దని డిమాండ్ చేశారు. గతంలో రైతుల ఆమోదం లేకుండా ఫార్మాసిటీకి సేకరించిన భూములను తిరిగి రైతులకే ఇవ్వాలన్నారు. ఒకవైపు కోర్టులో ఫార్మాకు అనుకూలమని చెప్పిన ప్రభుత్వం, మరోవైపు ఫార్మాను రద్దు చేశామని రైతులను మోసం చేస్తుందన్నారు. ఫార్మాసిటీని రద్దు చేస్తే అధికారికంగా జీవోను విడుదల చేయాలన్నారు. ఫార్మాకు ఇవ్వని 2200 ఎకరాల భూములకు సంబంధించి రికార్డులో టీఎస్ఐఐసీ పేరును తొలగించి తిరిగి రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, మండల కార్యదర్శి నర్సింహ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సీపీఎం నాయకులు రామచంద్రయ్య, అంజయ్య, ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే ఆర్థిక స్వావలంబన

మహిళా దినోత్సవంలో పాల్గొన్న సంపూర్ణారెడ్డి, వలు సంఘాల ప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 11: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు లోని వార్డు కార్యాలయంలో సీడ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మామ్, స్టార్, తరుణి మిత్ర మిల్లెట్స్ గ్రూప్స్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మిల్లెట్స్‌తో తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, ఎన్టీపీసీ విశ్రాంత డీజీఎం రాజేందర్ మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆర్థిక స్వావలంబన సాధ్యమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శ్రేయ, రాజ్యలక్ష్మి, నర్సింహ, కేకేఎల్ గౌడ్, నిర్మల పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆహ్వానం

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో చంద్రకళ

చేవెళ్లటౌన్, మార్చి 11: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-2026 మొదటి సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ ప్రవేశాల కోసం మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో చంద్రకళ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత మాట్లాడుతూ.. 2025-26 సంవత్సరానికి కళాశాలలో పీఎంయూఎస్‌హెచ్ నిధుల నుంచి మొదటి అంతస్తు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నిర్మాణం తర్వాత విద్యార్థులకు ల్యాబ్ సదుపాయాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం సూర్యనారాయణ, రమేశ్, బాబు, తులసి ఉన్నారు.

నష్టపరిహారం అందజేయాలి

అడవి పందుల దాడిలో టమాట పంట ధ్వంసం

పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మంచాల, మార్చి 11: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన జగన్ మోహన్‌రెడ్డికి చెందిన వ్యవసాయ పొలంలో అడవి పందులు టమాట తోటతో పాటు ఇతర పంటలను ధ్వంసం చేశాయి. మంగళవారం వ్యవసాయ శాఖ అధికారి కృష్ణమోహన్, ఏఈవో లింగస్వామితో పాటు తదితరులు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతు అధికారులతో మాట్లాడుతూ అడవి పందుల నుంచి పంటలను రక్షించుకోవడం కోసం సోలార్ ఫెన్సింగ్‌ను ఉచితంగా అందజేయాలని కోరారు. అదేవిధంగా ధ్వంసమైన పంటలకు నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు. పంటలను పరిశీలించిన వారిలో విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



మంచాల, మార్చి 11: మండల పరిధిలోని అస్మత్‌పూర్‌లో ఇబ్రహీంపట్నం సాధురం కంటి దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో డాక్టర్ ఎంఎస్‌రెడ్డి కంటి సమస్యతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ భగవాన్, గ్రామస్తులు బాల్‌రాజ్, శివ, గాలయ్య, పుట్ట మల్లయ్య, రాములమ్మ పాల్గొన్నారు.

ఘన సన్మానం

చేవెళ్లటౌన్, మార్చి 11: ఇటీవల వెలువడిన గ్రూప్ -1, 2 ఫలితాల్లో సత్తాచాటిన మండలానికి చెందిన అభ్యర్థులను చేవెళ్ల ఆర్డీవో చంద్ర కళ ఘనంగా సన్మానించారు. మంగళవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న వినయ్ కుమార్ 483 మార్కులు సాధించి గ్రూప్ -1కు సెలెక్ట్ కాగా, చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రకాంత్ 27వ ర్యాంకు సాధించి గ్రూప్ -2కు సెలెక్ట్‌అయ్యాడు. ఈ సందర్భంగా చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో వారిని ఆర్డీవో చంద్రకళ, చేవెళ్ల తహసీల్దార్ కిష్టయ్య, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, రాజేందర్‌తో కలిసి సన్మానించి అభినందించారు. వీరి వెంట ఆర్డీవో సిబ్బంది తదితరులు ఉన్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి..

ఆమనగల్లు, మార్చి 11: నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా వెళ్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్‌ను ఆమనగల్లు పట్టణంలో జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, నాయకులు నేనావత్ నరేందర్ రాథోడ్, లక్ష్మణ్, రవి రాథోడ్, ఆనంద్, బాలు, భాస్కర్, జయరాం, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్‌తో పలు గ్రామాలకు అన్యాయం

ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలి
మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, మార్చి 11: రేవంత్‌రెడ్డి సర్కార్ తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో... గతంలో రంగారెడ్డి జిల్లాలో కలిపిన నాలుగు మండలాల పరిధిలోని గ్రామాలకు అన్యాయం జరుగుతున్నదని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కందుకూర్, కడ్తాల్, ఆమనగల్లు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండలాల పరిధిలోని పలు రెవెన్యూ గ్రామాలను కలుపుకొని ఫ్యూచర్ సిటీ పేరుతో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. గతంలో పాలమూరు జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లాలో కలిపిన... కడ్తాల్, ఆమనగల్లు మండలంలోని కొన్ని రెవెన్యూ గ్రామాలనే కార్పొరేషన్ పరిధిలోకి తేవకోవడానికి ప్రభుత్వం సిద్ధమైందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకొని కడ్తాల్, ఆమనగల్లు మొత్తం మండలాలతోపాటు తలకొండపల్లి, మాడ్గుల్ మండలాలను కార్పొరేషన్ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. గతంలో రంగారెడ్డి జిల్లాలో కలిపిన నాలుగు మండలాలను కార్పొరేషన్ పరిధిలోకి తెచ్చేలా కాంగ్రెస్ నేతలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్.మహేశ్, మాజీ సర్పంచ్‌లు తులసీరాంనాయక్, యాదయ్య, హరిచంద్‌నాయక్, శ్వేతాభూనాథ్‌నాయక్, లోకేశ్‌నాయక్, భారతమ్మనర్సింహాగౌడ్, మాజీ ఎంపీటీసీలు సువాలీపంతూనాయక్, ప్రియరమేశ్‌నాయక్, సాయిలు, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, రైతు సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు రామచంద్రయ్య, బాబా, శ్రీకాంత్, జంగయ్య, పాండు, శ్రీను, గోపాల్, జైపాల్, పాండు, రవి, వినోద్ పాల్గొన్నారు.

మహిళలకు బహుమతులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

షాబాద్, మార్చి 11: నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని చందనవెల్లి మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చందనవెల్లిలో నగరానికి చెందిన యునైటెడ్ ఆఫ్ హైదరాబాద్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో ప్లాస్టిక్‌ను నివారించేందుకు మహిళా సంఘానికి స్టీల్ టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నీరజ, మాజీ ఉప సర్పంచ్ ప్రమీల, గ్రామ పెద్దలు చేవెళ్ల స్వామి, వెంకటేశ్, సంస్థ ప్రతినిధులు రమేశ్, రాములు, మహిళా సంఘాల సభ్యులు, వీడీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

యాచారం బస్టాండ్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

యాచారం, మార్చి11: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ సక్రూనాయక్ సూచించారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో యాచారం పోలీసులు మంగళవారం సైకిల్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు, ప్రయాణికులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ..ప్రజలు దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత గంజాయి, డ్రగ్స్, మద్యపానం, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండేలా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ముఖ్యంగా బస్టాండ్లు, సంతల్లో మహిళలు సెల్‌ఫోన్లు, గొలుసు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సంతోష ఉన్నారు.

జాతరకు వెళ్లొచ్చేసరికి చోరీ

వస్తువులను పరిశీలిస్తున్న ఎస్సై

పెద్దఅంబర్‌పేట, మార్చి 11: జాతరకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి కథనం ప్రకారం.. కవాడిపల్లి గ్రామంలోని ఉదయ గార్డెన్ కాలనీలో నివాసం ఉంటున్న సతీశ్ సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి జూలూరు గ్రామంలో జరుగుతున్న జాతరకు వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి ఇంటి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న బంగారం, వెండి వస్తువులు, నగదు చోరీ అయినట్టు గుర్తించారు. బాధితుడు సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

చేవెళ్లటౌన్, మార్చి 11: భూమిలో బోరు వేయనిస్తలేరని ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చేవెళ్లలో చోటు చేసుకుంది. బాధితులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని నాంచెరి గ్రామానికి చెందిన వల్లబాయ్‌కి రెండు ఎకరాల భూమి ఉంది. తనకు ఉన్న భూమిలో బోరు వేసుకుందామంటే ఈ క్రమంలో పోలీసులకు ఫోన్ చేసి, పోలీసులను పంపి బోరు వేయకుండా తమ గ్రామానికి చెందిన కొందరు అడ్డుకుంటున్నారని తెలిపారు. దీంతో ఆవేదనకు గురైన యువకుడు ఓ గార్డెన్‌లో ఒంటి పైన పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అక్కడే ఉన్నా బాధితుడి బంధువులు గమనించి తన ఒంటి పైన నీరు పోసి అతడిని ప్రమాదం నుంచి కాపాడారు. మాకు న్యాయం జరుగాలని అధికారులను కోరాడు.

ఆర్థికసాయం

కేశంపేట, మార్చి 11: మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన రొయ్యల రాజు(32) సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, కోఆప్షన్ మాజీ సభ్యులు జమాల్‌ఖాన్, బీఆర్ఎస్ నేతలు మంగళవారం రాజు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తక్షణ సహాయంగా నవీన్‌కుమార్, రూ.5వేలు, జమాల్‌ఖాన్ రూ.3వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కార్యక్రమంలో నరేశ్‌యాదవ్, జగన్‌రెడ్డి, వెంకటేశ్, గణేశ్‌గౌడ్, కృష్ణయ్య, మల్లేశ్, శ్రీకాంత్, శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితితో లా విద్యార్థి మృతి

నందిగామ మండలం మొదళ్లగూడ సింబయాసిస్ యూనివర్సిటీలో ఘటన
కళాశాల ఎదుట స్థానికుల ధర్నా
కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సింబయాసిస్ హాస్టల్ గదిని పరిశీలిస్తున్న పోలీసులు

శగనిక్ బసు (ఫైల్)

నందిగామ, మార్చి11: మండల పరిధిలోని మొదళ్లగూడలోని సింబయాసిస్ యూనివర్సిటీలో అనుమానాస్పద స్థితిలో లా విద్యార్థి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన చెందిన శగనిక్ బసు (21) నందిగామ మండలం సింబయాసిస్ యూనివర్సిటీలోని హాస్టల్ ఉంటూ బీఏ ఎల్ఎల్‌బీ మూడో సంవత్సరం చదువుకుంటున్నాడు. సోమవారం మధ్యరాత్రి సమయంలో వాష్‌రూముకి వెళ్లిన శగనిక్ బసు ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో తోటి విద్యార్థులు రోహిత్, అర్షిత్ ఇద్దరు డోర్ కొట్టారు. అనుమానం వచ్చి వెంటిలేటర్ నుంచి చూడగా బాత్రూమ్‌లో శగనిక్ బసు పడిపోయి ఉన్నాడు. దీంతో కళాశాల సిబ్బంది సమాచారం అందించి బయటికి తీసి వెంటనే చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో మృత దేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారని నందిగామ సీఐ ఎస్ఐ గోపాలకృష్ణ తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చునని వైద్యులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిపారు.

సింబయాసిస్ ఎదుట స్థానికుల ధర్నా..

సింబయాసిస్ యూనివర్సిటీలో ల